# భస్మ సింహాసనం

వడగాలుపు వడి తగ్గి చల్లగాలి అప్పుడే తిరిగింది. ఊరుకు మాగన్నుగా కునుకుపట్టింది. చదురుమదురుగా అప్పుడప్పుడు కుక్కల అరుపులు, దూరాన పొలాల్లోంచి ఓ నక్కకూత తప్ప ఊరు నిశ్శబ్దంగా వుంది.

ఆ నిశ్శబ్దాన్ని బద్దలుచేస్తూ "యేదో తగలడి పోతన్నాదయ్యోవ్, అకాశవంతా ఎర్రబడిపోనాది."

"ఏటే? ఎక్కడే!"

"తూరుపెంపు నంటుకున్నట్టున్నాదేదో. కుండా మండా బయటాడెయ్యండల్లా, అల్లా సూత్తారేటల్లా గుడ్లప్పగించీ" రత్తికంగారుగా గంతులేస్తోంది.

"మాలపల్లి అంటుకుంది, మాలపల్లి అంటుకుంది." వీధుల్లో అరుపులు, జనం పరుగులు. మాలపల్లి దగ్గరికి జనం గుమిగూడారు.

మాలపల్లికి దగ్గరగావున్న యిళ్ళవాళ్ళు అరచేతుల్లో ప్రాణాలను పెట్టుకుని అగ్గిదేవుడ్ని శోకండాలతో వేడుకుంటున్నారు.

మాలపల్లిలోంచి పిల్లామేక, ముసలి ముతక మంటల్లోంచి, ఏడుస్తూ భయంతో అరుస్తూ ఊరికి మాలపల్లికి మధ్యవున్న పెద్ద చింత కిందకి చేరుకుంటున్నారు.

మంటలు నాలుకలు చాచుకుని అకలిగా ఎండిన తాటాకు కుప్పల్ని యిట్టే నుసిచేస్తున్నాయి. కేరింతలుకొడుతూ వాటా పంతాలమీద మంటలు ఆకాశాన్నంటుతున్నాయి. వెదురుబొంగులు పెటపెట పేలు తున్నాయి. మంటల్లో చిక్కుకున్న కుక్కలు, కోళ్లు వెర్రిగా గొంతులు బద్దలయ్యేలా అరుస్తున్నాయి. పశువులు కట్రాటల చుట్టూ అలంగం తిరుగుతూ, తాళ్ళు తెంచుకుందుకు ప్రయత్నం చేస్తూ పిచ్చిగా అరుస్తున్నాయి.

పిల్లలు గుక్కపెట్టి ఏడుస్తున్నారు.

జనం అరుపులు – "నీళ్ళు–నీళ్ళు బిందెలు – మోకులు నిచ్చెన్లు – మంటలు వూరిమీద కొచ్చేత్తన్నాయ్‌రా! ఆర్పండ్రా"

"సూత్తావేట్రా గుడ్డప్పగించి పంచెగొట్రా సత్తిగా"

"నడ్రా పుల్లిగా"

"ఒరేయ్ సోములు! బనీనిప్పెయ్యహ" అదమాయింపులు, ఆదేశాలూనూ, అంతా కోలాహలంగా వుంది.

"అయ్‌బాబోయ్! సంటి దాపట్టంలేదు. మంటల్లో సిక్కడిపోయినట్టున్నాది. నా

సంటి దాపట్టంలేదు బాబోయ్ - అయ్య బాబోయ్ –" పుత్రిది గుండెబాదుకుని ఏడుస్తోంది చింతచెట్టుకిందికి చేరిన జనంలోంచి.

"మా ముసిల్దేదే లప్పా - ముసిల్దాపడ్డంలేదు. ముసిల్దాన్ని పొట్టనెట్టేసుకున్నాడీ అగ్గిదేవుడు. అయ్య బాబోయ్" మంగి శోకండాలు.

"ఈడ కూకుందే ముసిల్ది" మరోపక్కనించి మిరియమ్మ కేక.

"సంటిదాన్ని వుయ్యాల్లోనే వదిలేశాను దేవుడోయ్....ఒరి దేవుడోయ్, నాసంటిదాన్ని మంటల కప్పగించేశాను దేవుడోయ్" పుత్రిది గుండెలు బాదుకుంటూ మంటల్లోకి పోబోతుంటే జనం పట్టుకుంటున్నారు. గింజుకుంటోంది.

పొలం యిల్లూతప్ప ఎన్నడూ బయటికిరాని నారాయణమూర్తి పంచెగగట్టి, 'ఉండే పుత్రిదానా! నీ సంటిదాన్ని నే తీసుకొత్తాను?' అని మంటల్లోకి చొచ్చుకుపోయాడు.

"నువ్ దేవుడ్లా వచ్చావ్ నారాయణమూరితి బాబోయ్, నా బిడ్డని నువ్వే కాపాడాలి బాబోయ్. నాకు నువ్వే దేవుడవ్ బాబోయ్!" అని ఏడుస్తూనే వుంది పుత్రిది.

నారాయణమూర్తి చంటిపిల్ల నెత్తుకొని మంటల్లోంచి బయటపడ్డాడు. పుత్రిది ఒక్కపరుగున ఎదురెళ్ళి బిడ్డను అందుకుని గుండెలకు హత్తుకుంది వెర్రిగా ఏడుస్తూ.

పిల్ల గుక్కపెట్టి ఏడుస్తూనే వుంది.

నారాయణమూర్తి గుండెలమీద వెంట్రుకలు కాలిపోయాయి. భుజంమీద తాటిబొంద పడి కాస్తమేర బొబ్బ లేచింది. కనుబొమ్మలు మాడిపోయాయి.

ఊరుకూడా అంటుకునేదేగాని, ఊరికి మాలపల్లికి మధ్యనున్న పెద్ద చింతచెట్టు మంటల్ని ఊరుమీదికి రాకుండా కాసింది. తను సగం కాలిపోయి - గాలికూడా కాస్త తగ్గింది.

కనకయ్య మేష్టారు పక్కూరుకెళ్ళి, రైసుమిల్లులోంచి నీళ్ళకారు కోసం బస్తీకి ఫోన్‌చేసి, కారు ఆదారినే వస్తుంది కాబట్టి, వచ్చేదాకా ఆగి, ఆ కారే యెక్కి వూళ్ళోకొచ్చారు.

మంటలు చప్పబడిపోయాక నీళ్ళకారు వచ్చింది. ఊరు చెరువుకి గొట్టాలు కలిపి ఆరిపోయిన మాలపల్లిని ఆర్పేసింది. ఆ ప్రాంతం అంతా మాడువాసన.

తెల్లవారింది.

సగం కాలిపోయిన చింతచెట్టు నీడలో మాలపల్లి మొత్తం నీడ వెతుక్కుంది. ఊరంతకి తెల్లవారినా వాళ్ళందరికీ యింకా చీకటిగానే వున్నట్టుంది. వాళ్ళ ముఖాల్లో భయం కొట్టొచ్చినట్టు కనబడుతోంది. వాళ్ళ ముఖాలమీద కన్నీటిచారలు యింకా చెరగలేదు. పిల్లలు యింకా వుండుండి ఉలిక్కిపడుతున్నారు. ముసలివాళ్లు వుండుండి లోపల్లోపల ఏదో సణుక్కుంటూ ఏడుస్తున్నారు.

ఎదురుగా వున్న రామాలయం అరుగుమీదికి గ్రామపెద్దలు చలిది పొద్దెక్కేవేళకి చద్దికూళ్ళు తిని సభ చేశారు.

పుత్రిదాని చంటిదాన్ని కాపాడిన నారాయణమూర్తే; ఎన్నడూ పదిమందిలోకి రానివాడైనా ఆరోజున ముందుగా మాట్లాడాడు.

"మొత్తం మాలపల్లి ఒక్క గడపేనా మిగలకుండా తగలడిపోయింది. మనల్ని కనిపెట్టుకుని బతికే పాటపోళ్ళు. మనమే ఏదో ఒకటి సెయ్యకపోతే ఆళ్ళేవైపోతారు పాపం" అన్నాడు నారాయణమూర్తి అందర్నీ ఉద్దేశించి.

"అది సరేలే, ఒకళ్ళకీ, యిద్దరికీ అయితే ఏదో సాయం సెయ్యగలంగాని, మొత్తం అయిదొందలమంది కంటే ఎవరు మాత్రం ఏం సేత్తాం" అన్నాడు నరసయ్య.

"అట్టాగని వదిలేత్తాంవేటి? తలకో సెయ్యా ఏత్తే అదే కొండంతాద్ది. నామటుకు నేను నా పడవటి పొలం తాటికట్టంవలోయ్ ఓ పాతిక తాళ్ళు యిత్తాను, కొట్టుకోమనండాళ్ళని, పాతిక ముప్పై కొంపలకి వాసం అవుద్ది" అన్నాడు పెద్దకాపు.

"మాకట్టంవలో నాలుగైదేలు ఆకుంటదిమరి, కొట్టుకోమనండి" అన్నాడు చౌదరమ్మగారి సూరయ్య.

"అది సరేనయ్యా! అయ్యన్నీ పోగేసుకుని కొంపలు నిలబెట్టుకోవాలన్నా, ముందీరోజు ఆళ్ళు తిండితిని బతకాలిగందా? దాని సంగతాలోచించండి మరి" అన్నారు నారాయణమూర్తి కుండబద్దలుకొట్టినట్లు.

ఒక్కక్షణం అంతా నిశ్శబ్దం.

"కలెక్టరుకి తంతి పంపితే?" అన్నాడు కనకయ్య మేష్టారు పెద్ద ఆలోచన తట్టినట్టు.

"అయినగోరికి తంతి అంది వచ్చేటప్పటికి ఓరోజో రెండ్రోజులో పడదా? అప్పటిదాకా ఈ పిల్లాజల్లాతోటి యీళ్ళంతా పళ్ళిగిలించుక్కూకోడవేనేటి?" అన్నాడు నారాయణమూర్తి.

"ఏవయ్యా పెసిడెంటూ: పంచాయితీ డబ్బులోంచి తీసి కరుసు పెట్టకూడదూ ఈయాల్టికి" అన్నాడు పెద్దకాపు.

"దానికి సాంక్షను కావాలి. అదొచ్చేటప్పటికి రోజులే పడద్దో నెల్లేపడద్దో మరి" అన్నాడు ప్రెసిడెంటు.

"తాసిల్దారుకి తెలియపరిత్తే కొంపకి పాతికో పరకో యిత్తాడుమరి, ఎవరేనా ఎడితే నేనుత్తరం యిత్తాను మరి" అన్నాడు మునసుబు.

వాళ్ళందరి ధోరణి వినేసరికి నారాయణమూర్తికి ఒళ్ళుమండింది.

"ఇయన్నీ యీయాలకి అందే సాయాలు కావుకాని, నామట్టుకు నేను ఐదుబత్తాల గింజలిత్తన్నాను. ఇంకెవరెవ రేవేవిత్తారో సెప్పండి, బండిమీద బత్తాలేసుకుని పక్కూరుకెల్లి రైసుమిల్లులో ఆడించుకొత్తే పొద్దాలేయాల్టకేనా ఆళ్ళకి కాసన్ని గంజినీళ్ళొయ్యొచ్చు?" అన్నాడు నారాయణమూర్తి తెగింపుగా.

పెద్దలందరికీ పచ్చివెలక్కాయి గొంతుక్కి అడ్డంపడ్డట్టయింది. ఇంక తప్పనిసరై ప్రెసిడెంటు, మునసబు, కరణాలు, యితర పెద్ద రైతులూ యిష్టంవున్నా లేకపోయినా తలోబస్తా, రెండు బస్తాలు యిస్తామన్నారు.

నారాయణమూర్తే నడుంకట్టి, ఆ ధాన్యం రైసుమిల్లుకి తోలుకెళ్ళి ఆడించుకొచ్చాడు మరో యిద్దరు మాలవాళ్ళ సాయంతో.

పొద్దు పడమటికి వాలిపోయింది. చింతకింద నీరెండల కెదురుగా అంతా అరటాకులు పరుచుక్కూర్చున్నారు. నీళ్ళునిండిన కళ్ళతో అంతా పులుసూ అన్నం తిన్నారు నారాయణమూర్తి ధర్మమా అని. ఆ రోజున నారాయణమూర్తి భోజనం చేయలేదు. వాళ్ళందరికీ అండగా నిలిచాడు. పసిపిల్లలకి తనింటినుంచే పాలు తెప్పించికూడా యిచ్చాడు. ఆరోజున వాళ్ళంతా నారాయణమూర్తిని మనసారా పొగుడుతూనే వున్నారు. కృతజ్ఞతలు తెలుపుకొంటూనే వున్నారు. ముసలివాళ్ళు చెయ్యెత్తి దణ్ణం పెట్టారు.

నారాయణమూర్తి ఎన్నడూ అనుభవించని ఆనందాన్ననుభవించాడు. అతని మనసెంతగానో ఉప్పొంగిపోయింది.

గ్రామ మునసబు రిపోర్టుమీద మూడోరోజు సాయంకాలానికి, కలెక్టరు, తాసిల్దారు బయలుదేరి వచ్చారు. ప్రెసిడెంటు – గారింటిముందు జీపు దిగారు. ప్రెసిడెంటు – మునసబు, కరణాలకి, పెద్ద మాలలకి కబురు చేశాడు. పెద్ద మాలలు నారాయణమూర్తిని కలుసుకొని, వెంటబెట్టుకొని ప్రెసిడెంటుగారింటికి చేరారు.

లోపల పెద్దలు, ఆఫీసర్లు ఫలహారాలు సేవించారు. పొలాల్లో వున్న మిగతా పెద్దలుకూడా ఆఫీసర్లు వచ్చారని తెలిసి ఊళ్ళోకి వచ్చేశారు.

ముందు కలెక్టరు, తాసిల్దారు, ఆవెనక ప్రెసిడెంటు, మునసబు, కరణాలు ఆవెనక నారాయణమూర్తి, మిగిలిన పెద్దలు, ఆ వెనక యిళ్ళు కాలిపోయిన మాలలు, ఇంకా పిల్లా పెద్ద మౌనంగా పెద్దవాడి శవం వెనక నడిచినట్లు మాలపల్లిలోకి నడిచారు.

నాజూకైన ఇంగ్లీషు ధోరణి తెలుగులో "అసలు నిప్పు యెట్లా పుట్టింది?" అన్నారు కలెక్టరుగారు ఎదురుగా చేతులు కట్టుకు నిలబడ్డ పెద్దమాల వీరడ్ని ఉద్దేశించి.

వీరడు మునసబుగారివైపు, నారాయణమూర్తిగారివైపు చూశాడు అర్థంకానట్టు. "అసలు అగ్గెలా రాజుకుందన్నార్రా కలెక్టరుగోరు" అని విడమర్చి చెప్పాడు నారాయణమూర్తి వీరడుకి.

"తెల్దయ్యా? తానంతటదే రాజుకొనుంటాది మరి. అద్దరేతిరికాడ అంతా మాంచి నిద్దట్లో వున్నాం బాబు. మాకేటి తెలుత్తాది?" అన్నాడు వీరడు వినయంగా.

"ఎవరేనా ముట్టించారని అనుమానం వుందయ్యా నీకు?"

"అట్టాటి దగుల్బాజీ పని మడిసన్నోడు ఎందుకు సేత్తాడు బాబు!"

"యీ వూళ్ళో ఎలక్షను ఫేక్షన్స్ ఏమయినా వున్నాయా!" తాసిల్దారుని, మునసబుని వుద్దేశించి చాలా నెమ్మదిగా అడిగాడు కలెక్టరుగారు.

"అబ్బెబ్బే. అల్లాంటిదేమీ లేదండీ ఊళ్ళో" అన్నాడు తాసిల్దారు.

"వీళ్ళందరికీ యీ రెండ్రోజులు వూరంతా కలిసి తిండి కూడా ఎట్టిందండి" అన్నాడు నారాయణమూర్తి.

"అదంతా నారాయణమూర్తి బాబు, పెద్దకాపుల దయేనండి బాబు" అన్నాడు వీరుడు.

ఇంకా అక్కడ కాటువాసన కొడుతూనే వుంది. కాలిన తాటిబొందల మధ్య తాటాకు బూడిద మధ్య నిలబడిన కలెక్టరుగారు చుట్టూ కలియచూసి "యిక్కడ బూడిద తప్ప యింకేమీ కనబడ్డంలేదు. ఏముండి వుంటుందిక్కడ కాలిపోవడానికి!" అన్నారు.

"కంపా కర్రా నిలబెట్టి మట్టి మెత్తుకుని తాటాకులు కప్పుకున్న గుడిశలే కదండి కాలిపోతే బూడిద తప్ప యింకేం వుంటుంది" అన్నాడు నారాయణమూర్తి.

కాస్తదూరంలో సిమెంటు అరుగులు, పండిటికి బోడి గోడల్ని చూసి, "యిదెవరిల్లు?" అన్నారు కలెక్టర్.

"గొంతెమ్మోరుదండి" అన్నాడు వీరుడు.

"వారెవరు"

"మా దేవతండి, మా దేవత గుడండది."

"ఐసీ! దీనిక్కూడ రినోవేషన్‌కి కొంత డబ్బు శాంక్షన్ చెయ్యండి" అని తాసిల్దారుని ఆదేశించారు కలెక్టర్.

కలెక్టర్ బయటికి నడుస్తూ "మొత్తం హరిజనపేటలో ఎన్నిళ్ళున్నాయండీ" అన్నారు మునసబుతో.

మునసబు కరణంగారివైపు చూశాడు.

"దాదాపు రెండువందల గడపదాకా వుంటాయండి" అన్నాడు కరణం.

"ఇంత చిన్న ఏరియాలో రెండువందల యిళ్ళా? ఓ మై గాడ్! యింత యిరుగ్గా పూరేటి యిల్లు యిల్లు రాసుకునే నిప్పు పుట్టొచ్చు, చాన్సెస్. ఈ హరిజనపేట నానుకొనివున్న లేండ్ ఎవరిది?"

"సుబ్బారావుదండి" కరణంగా రన్నారు.

"ఎవరిదైతేనేం. అక్కడొక ఫిఫ్టి సెంట్స్ ఎక్విజిషన్‌కి పెట్టండి. వీళ్ళందరికీ యిళ్ళ స్థలాలు నెలరోజుల్లో ఎలాట్ చేయించండి. విశాలంగా వుండేలా ఇళ్ళు కట్టుకునేటట్టు చూడండి సరేనా. యిళ్ళు కాలిపోయిన వాళ్ళందరికీ యింటి ఒక్కంటికి ఫిఫ్టి రూపీస్ చొప్పున పంచండి" అని అక్కడి కక్కడ ఆర్డర్లు జారీచేసి వెళ్ళిపోయారు కలక్టరుగారు.

మర్నాడు సాయంత్రం నాలుగు గంటలకి ఊళ్ళోకి మళ్ళీ తాసిల్దారుగారి జీపొచ్చింది. పంచాయతీ బోర్డు ఆఫీసు అరుగుమీద, తాసిల్దారు గారు, ప్రెసిడెంటు, మునసబు, కరణాలు, కనకయ్య మేస్టారు సభ చేశారు. ఎదురుగావున్న గుడి అరుగుమీద గ్రామ పెద్దలు కూర్చున్నారు. ఆఫీసు ముందున్న వీధిలో యిళ్ళు కాలిపోయిన మాలలంతా చేతులు కట్టుకొని నిలబడ్డారు.

"కాలిపోయిన ప్రతి యింటికి ఏభై రూపాయలు చొప్పున ఇమ్మని కలెక్టర్‌గారి ఆర్డరు. కరణంగారు ఇంటి యజమాని పేరు చదువుతారు. ఆ మనిషివచ్చి ఈ

రిజిష్టరులో సంతకం చేసో, వేలిముద్ర వేసో డబ్బు తీసుకెళ్ళండి. తరువాత ఇళ్ళు కట్టుకోండి" అని విషయాన్ని తెలియజెప్పారు తాసిల్దారుగారు.

"దొరగారికో సిన్న మనవండి బావ్" అన్నాడు పెద్ద వీరడు చేతులు జోడించి.

"ఏమిటది?"

"మరేం నేదండి బావ్, మేవంతా కట్టంలో వుంటే మమ్మల్ని బిడ్డల్లా కడుపులో ఎట్టుకొని దాసుకున్నాడు బావ్ మా నారాయణమూర్తి బాబు. తవరు ఏడ యేలి ముద్దర నొక్కమంటే అడనే నొక్కేత్తావ్ మేమంతా. మా కివ్వాల్సిన డబ్బంతా ఆ బావ్ సేతికే యిచ్చెయ్యండి బావ్ మొత్తంగా. కలకటేర్ బావ్‌గారు మాకు కొత్త తలాలు యిప్పిత్తానన్నారుగా. ఆ తలాలొచ్చినాక నారాయణమూర్తి బాబే మా కొంపలు నిలబెడతాడు. అందాకా మేవ్ బతుకుతున్న కమతాల్లోనే ఏ సెట్టునీడనో, ఏ గొడ్లపాకల పంచనో రోజులు నింపుకుంటాం బావ్" అన్నాడు వీరడు ప్రార్థనగా.

"ఇళ్ళ స్థలాల పంపిణీ అంత త్వరగా జరుగుతుందామరి?" తాసిల్దారుగారు ఆ పనిలోవున్న కష్టాన్ని వ్యక్తం చేస్తోన్నట్టు అన్నారు.

"తమరే తల్చుకుంటే అదేవంత పెద్దపని కాదనుకుంటాను. స్థలాలు మీరు పంచిన తరువాతే అళ్ళు యిళ్ళు కట్టుకుంటే మంచిదనుకుంటాను" అన్నాడు నారాయణమూర్తి.

"సిత్తంబాబు. ఈ కాతంత వుపకారం తవరు సేత్తే సచ్చి తమ కడుపున పుడతాం బావ్" వీరడు వంతపాడాడు.

తాసిల్దార్‌గారి సమాధానం కోసం వాళ్ళంతా ఆత్రంగా యెదురు చూశారు. కొద్దిక్షణాల నిశ్శబ్దం తర్వాత "సరే అయితేను. రేపే రెవిన్యూ ఇన్‌స్పెక్టర్నీ, సర్వేయర్నీ పంపిస్తాను. వీలయినంత త్వరలో పనులు పూర్తయ్యే ఏర్పాటు చేస్తాను. డబ్బు ముందు మీరే తీసుకొని ఆ తర్వాత మీ ఇష్టం వచ్చినవాళ్ళ చేతికిచ్చి దాచుకోండి. మేము మీకే ఇవ్వాలి" అన్నారు తాసిల్దారు.

ఎట్లాగూ వీళ్ళంతా డబ్బు తీసికెళ్ళి నారాయణమూర్తికే యిస్తారని గ్రహించిన ప్రెసిడెంటు, నారాయణమూర్తికి లేని పోనీ పెద్దరికం వచ్చి పడిపోతోందన్న కన్నెర్రతో "ఆ తలాలేయో అళ్ళకిచ్చినాకనే ఈ డబ్బు కూడా పంపిణీ సేత్తే పోలా?" అన్నాడు.

"ఆ మాటా రైటే. అళ్ళ డబ్బు మద్దిలో యింకొకడి దగ్గరెందుకూ?" సాగదీశాడు మునసుబు.

"అలా వీల్లేదు. ఈ డబ్బు తక్షణం అగ్ని బాధితులకు అందచేయాలని కలెక్టర్ ఆర్డర్స్" అని తాసిల్దార్‌గారు కార్యక్రమాన్ని కొనసాగించారు.

అగ్ని బాధితులంతా తాము తీసుకున్న డబ్బు నారాయణమూర్తి చేతికందించారు. సభ ముగిసింది.

☆ ☆ ☆

నెల రోజులలో హరిజన పేటకి యిళ్ళ స్థలాల పంపిణీ జరగాలని కలెక్టరుగారి ఉత్తర్వులున్నాయే తప్ప విగ్రహాలకి నైవేద్యాలు ముట్టకా ఆఫీసులలో పనులు చేయించుకోవడం చేతనయిన సమర్థుడు ఆఫీసుల చుట్టూ తిరగకా రెండో నెలకూడా

పూర్తి కావస్తోన్నా స్థలాల పంపిణీ జరగలేదు. అక్కడికీ నారాయణమూర్తి తన సొంత డబ్బులు ఖర్చు పెట్టుకొని ఆఫీసుల చుట్టూ తిరుగుతూనే వున్నాడు. చివరికి కష్టంమీద సర్వేయర్లు వచ్చి అక్వైర్ చేసిన స్థలాన్ని ప్లాట్లుగా విడదీశారు. పట్టాలు హరిజనుల చేతికొచ్చాయి.

ఆ రోజున వాళ్ళంతా వుప్పొంగిపోయారు. యిదంతా నారాయణమూర్తి చలవవల్లే జరిగిందని కృతజ్ఞతతో నిండిపోయాయి వాళ్ళ మనసులు. పగలంతా చమటోడ్చి పనిచేసి, మసక చీకట్లో చింతచెట్టు నీడన మూడురాళ్ళ పొయ్యిలమీద వండుకు తిని రాత్రి తొమ్మిది గంటలయ్యే సరికి ఆడా మగా, పిల్లా ముసలీ కొత్తమాలపల్లిని కట్టుకునేందుకు సిద్ధమయ్యేవారు. భుజం భుజం కలిపి, శ్రమని మరచిపోయేందుకు ఏవో పాటలు పాడుకొంటూ చుక్క పొడిచే వేళదాకా గుడిశల్ని కట్టడంలో మునిగిపోయేవారు. ఆ ఉత్సాహంలో ఆవేశంలో నారాయణమూర్తి నాయకత్వం క్రింద "అది నాది: ఇది నీది" అన్న విచక్షణ మరచిపోయి పనిచేశారు వాళ్ళంతా. అది ఒక ఉద్యమంగా "అందరి కోసం ఒక్కడు, ఒక్కడి కోసం అందరూ" అన్నట్టు ఆ కొత్త ఇళ్ల నిర్మాణం సాగిపోయింది.

నారాయణమూర్తి వాళ్ళలో ఒకడిగా, వాళ్ళకోసమే బతికేవాడిలా, ఆ ఉద్యమానికి వూపిరిగా వాళ్ళమధ్య నిలబడ్డాడు. వాళ్ళతో నడుం వంచాడు. వాళ్ళ గుండెలలో చెరగని రూపంగా నిలిచిపోయాడు.

కొత్త మాలపల్లి తయారయింది. తీర్చి దిద్దినట్లు వీధులు, ఏది ఎవరిదో కనుక్కుందుకు వీల్లేనట్టు వరుసలు తీర్చి ఒకే నమూనాలో ఉన్న యిళ్ళూ వెలిశాయి. మాసిన తాటాకు కప్పులు పోయి – కొత్త నేతచీర కట్టుకున్న పేదపడుచుల్లా – కొత్త తాటాకు కప్పులతో మెరిసిపోతున్నాయి ఆ యిళ్ళు. చూరులు కూడా ఎగుడు దిగుడులు లేకుండా కత్తిరించారు. స్థలాల పంపిణీకి మూడు మాసాలుపట్టినా, ఆ స్థలాలలో ఇళ్ళు కట్టడం నెలరోజుల లోపునే జరిగిపోయింది.

నారాయణమూర్తి ఆహ్వానంమీద కొత్త మాలపల్లి ప్రారంభోత్సవానికి కలెక్టరుగారు వచ్చారు. మాలపల్లిలో గొంతెమ్మ గుడిముందు వేదిక ఏర్పాటు చేశారు. రంగురంగుల కాయితాల తోరణాలతో అలంకరించారు. జనం అంతా అక్కడికి చేరారు.

వాళ్ళ కళ్ళలో ఆ క్షణాన ఇళ్ళు కాలిపోయాయన్న బాధ ఎక్కడా కనిపించడం లేదు. కొత్త వెలుగును చూడగలుగుతున్న గుడ్డి వాళ్ళలా వాళ్ళకళ్ళు ఆనందంతో మెరిసిపోతున్నాయి.

కలెక్టర్‌గారు వేదిక మీదకొచ్చి వుపన్యసించి, నారాయణమూర్తి సంఘసేవా తత్పరతని, నిస్వార్థ త్యాగాన్ని కొనియాడి నారాయణమూర్తిని వేదికమీదికి ఆహ్వానించి స్వయంగా పూలమాల అతని మెడలో వేశారు. కరతాళ ధ్వనులుమిన్ను ముట్టాయి. సభ ముగిసింది – ఆనందంగా కాలం సాగిపోతోంది. కొత్త నీడలలో ఉల్లాసంగా బతుకుతున్నారు వాళ్ళంతా.

పంచాయితీ ఎన్నికల పండగొచ్చింది.

నారాయణమూర్తి తమకు చేసిన సేవలకి కృతజ్ఞతగా అతన్నే ప్రెసిడెంటుగా ఎన్నుకుంటే బాగుండు ననుకుంది మాలపల్లి. నారాయణ మూర్తికి చెడ్డవాడన్న పేరులేదు వూళ్ళో. మాలపెద్దలే, సెట్టిబల్లిపేట మెంబర్ను కూడా - నారాయణమూర్తినే ప్రెసిడెంటుగా ఎన్నుకునేందుకు వప్పించారు. గాలి తనకు అనుకూలంగా లేదని పాత ప్రెసిడెంటు తగ్గాడు.

దాంతో తొమ్మిది వార్డులనుంచి నెగ్గిన మెంబర్లూ నారాయణమూర్తినే ఏకగ్రీవంగా ప్రెసిడెంటుగా ఎన్నుకున్నారు.

నారాయణమూర్తి - చిన్న పంచాయితీకి ప్రెసిడెంటుగానే యెన్నికైనా, కలెక్టర్ కి చాలా సన్నిహితుడయ్యేడు. అతను చేసిన ఒక్కమంచి పనీ జిల్లాస్థాయి, గ్రామ నాయకుడ్ని చేసింది. నారాయణమూర్తిలో కొత్త నారాయణమూర్తి పుట్టి పెరిగాడు. మోకాళ్ళపైకుండే సాదా పంచె ఎం.ఎల్.ఏ. అంచు పొందూరు ఖద్దరు పంచెగా మారి, మడమల్ని ముద్దాడుతోంది. మోకాళ్ళదాకా దిగిన లాల్చీ అతన్ని నిండైన విగ్రహంగా రూపొందించింది. చూపులు, మాటలు చదరంగం ఆడడం నేర్చుకున్నాయి. సాఫీ అయిన అతని మనసు నగిషీలు చెక్కిన చదరంగపు పావుల్ని నడపడంలో నగిషీలను పుంజుకుంటోంది.

అవకాశాలు, అవసరాలు నారాయణమూర్తిని నూరుపైసలు నిండైన రాజకీయవేత్తను చేశాయి. అయిదేళ్ళ హయాంలో నారాయణమూర్తి పెంకుటిల్లు, మొదట డాబాగా, క్రమేణా రెండస్థుల భవనంగా మారింది. ప్రతినెలా వచ్చే అమ్మోనియా కోటా యిరవై ఎకరాల చెరుకుతోటను పెంచింది.

మెరిసే మాలపల్లి తాటాకు కప్పులు మాసి నల్లబడినాయి. వాళ్ళ గుండెలలో నాటుకున్న కృతజ్ఞత కరిగి అసంతృప్తిగా ప్రవహిస్తోంది. అపనమ్మకంగా రూపొందింది.

కాని నారాయణమూర్తి తన నీడనే తన విదుపుడు మెతుకుల్ని తినే కుక్కల్ని చేరదీశాడు. వాటికి తనెలా మొరగమంటే అలా మొరిగేలా తర్ఫీదు నిచ్చాడు.

అయిదేళ్ళు నిండాయి, మళ్ళీ ఎన్నికల పండుగ దగ్గరికొచ్చింది. అయిదేళ్ళ రాజకీయానుభవం జనం తనకెంత అనుకూలంగా వున్నారో గ్రహించుకునే శక్తిని నారాయణమూర్తి కిచ్చింది. ఈసారి కొంత ప్రచారం తప్పదనుకున్నాడు. కర్మంచాలక ఓడిపోతే ఆఫీసర్ల దృష్టిలోనూ జిల్లా నాయకుల దృష్టిలోనూ పరువు పల్చబడిపోతుందని లోలోన మధనపడ్డాడు. తెగించి సంచులు కోయడానికి సిద్ధపడ్డాడు. ప్రజల్ని తనవైపుకు తిప్పుకునేందుకు చిట్కాలను వెతుక్కున్నాడు. ఇదే అదను అనుకొని పాత ప్రెసిడెంటు గట్టిగా పనిచేసుకోవడం మొదలుపెట్టాడు.

రెండు కేంపులూ మంచి పకడ్బందీగా పనిచేస్తున్నాయి. కాని నారాయణమూర్తి కంచుకోటనుకున్న మాలపల్లిలోనే తాను నిలబెట్టిన ఇద్దరు మెంబర్లకీ వ్యతిరేకంగా కుర్రకారులోంచి రాజిగాడు, అప్పిగాడు నిలబడ్డారు. అది అతనికి మరీ మంటగా వుంది. పెద్ద మాలలు - వీరడుకి, సుబ్బడుకి కబురంపాడు నారాయణమూర్తి. వీరడు సుబ్బడు రెక్కలు కట్టుకొని వాలారు.

"ఏరా యీరా ఆ కుర్ర యదవలిద్దరూ నెగ్గేడుత్తారంటావా?"

"అనేనండాల్ల దీమా."

"మరయితే మనోళ్ళిద్దరి సంగతి!"

"అళ్ళూ ఆ ధీమాతోటే వున్నారండి మరి."

"మరి మీరేమంటార్రా?"

"తవరేవంటే మేము అదే అంటావండి మరి" అన్నాడు వీరడు.

"మరి నువ్వేవంటావురా అప్పిగా?" అన్నాడు నారాయణమూర్తి.

"నేనేటనగలనండా, నా మాట సొప్పాలంటే ఆ యిద్దరు కుర్రోళ్ళటేవవెంవల కంటె, ఫౌజునుంచి తిరిగొచ్చిన కనకయ్య గోడి జోరే పట్టపగ్గాలేకుండా వుందండా" అన్నాడు సుబ్బడు.

"ఏటంటాడేటాడు?"

"అడు యుద్ధం మడిసికాదండీ, ఈ ఎలచ్చన్లు గిలచ్చన్లు అంతా నాటకం, వూరుని మేసేసినోడికి, అడికొంప మేసేసి ఓ కాలో సెయ్యో తీసేత్తవే సొత్తి – అని మా సెడ్డా ఎగిరెగిరి పడతన్నాడండా అడు."

"ఆహా! అందాకా వచ్చిందేం? నేను తల్చుకుంటే ఏదో ఒక వంకపెట్టి తలే తీయించేత్తానని ఎరగడు కామోసు. కలెట్టరే మన జేబులో మడిసి. ఏటనుకుంటన్నాడో స–న్నా–సి నాయాల."

"సిత్తం. ఆడికింకా తవరి సంగతి తెల్దుకదండి. అడొచ్చి ఏడాదేగా అయింది" అన్నాడు వీరుడు.

"ఇంతకీ నే సెప్పిన సంగతి అళ్ళిద్దరితోటి మాటాడేవా."

"సిత్తం బాబయ్యా! నే సొప్పానండి. నారాయణమూర్తిబాబు సెరికో వెయ్యి యిత్తానన్నాడూ, తగ్గిపొండ్రా ఎదవ నాయాల్లారా అని మొన్నమాపు, నిన్న మాపూకూడా గొంతెమ్మ గుడరుగుమీద నండయ్యా కూకోబెట్టి సిలక్కి సెప్పినట్టు సెప్పా".

"ఏవన్నారేటి?"

"ఏవంటాని కేటుందండా! ఆ లంజాకొడుకు లిద్దరూ అళ్ళే పెసిడెంట్లయినట్టు మాటాడతన్నారండా. ఒకెయ్యి మన కెరేసి, వూరుమీద పదేలు తినేత్తాడూ. అయనగోరు సంగతి నీకేటి తెల్సు. పొగాక్కాడకి మెత్తపడి పోతావురా నువ్వు – అన్నారండి నన్ను. ఇంకేటి సొప్పమంటారయ్యా!"

"ఊఁ యింక మీరెళ్ళండి సేతకాని సన్నాసుల్దారికారంతా" ఉరిమాడు నారాయణమూర్తి.

ఎన్నికలు దగ్గర పడుతున్నాయి. ఇంక వారం రోజులున్నాయి. నారాయణమూర్తిగారి అరుగుమీద కూర్చుని కనకయ్య మేస్టారు వార్డుల వారీ ఓటర్ల లిస్టుల్ని తయారుచేస్తున్నారు. నారాయణమూర్తి ఇంటివైపు వచ్చిన వాళ్ళకి, వేళాపాళా లేకుండా నోర్లు తియ్యబడుతున్నాయి. కొంత మందొచ్చి చెపులు కొరికి వెడుతున్నారు. కొంత మందొచ్చి "మీరోసారిటురండి" అని లోపలికి తీసుకెడుతున్నారు. ఎడతెరిపి లేకుండా వచ్చి ప్రతివాడితో లేని నవ్వు తెచ్చిపెట్టుకొని మాట్లాడడంతో నారాయణమూర్తి దవడల కండరాలు నొప్పి పుడుతున్నాయి. అతని కుడిచెయ్యి ఎడమచెయ్యీ కూడా

ఎప్పుడూ ఎవరో ఒకరి భుజాలమీదే వుంటున్నాయి. అయినా నారాయణమూర్తి యింటికి, వచ్చినవాళ్ళే వస్తున్నారుగాని కొత్తవాళ్ళు రావడంలేదు. నీరు పల్లానికి ప్రవహించినట్టు జనం పాతప్రెసిడెంటు యింటికే పారుతున్నారు.

ఎలక్షను యింక రెండు రోజులలో జరగబోతోంది. నారాయణమూర్తికి ధైర్యం సన్నగిల్లుతోంది. ఆరిపోయే దీపాన్ని ఎగతోసినట్టు అతని పెంపుడు కుక్కలు అతనికి ధైర్యాన్ని చెబుతున్నాయి. గెలుపు మనదేనని బలంగా మొరుగుతున్నాయి. మరో కోటా కోసం నాలికలు చాస్తున్నాయి. నారాయణమూర్తి కాలు ఓ చోట నిలవడంలేదు. మనసు మనసులో వుండటంలేదు. కూడగట్టుకున్న పరువు కరిగిపోతుందేమోనన్న భయం. పరువు నిలబెట్టుకోవడానికి ఏం వడ్డడానికయినా సంసిద్ధమే – కాలం పరుగెడుతోన్నకొద్దీ అత్రం కళ్ళాలను విదలించుకొని ముందుకు దూకుతోంది.

తెల్లవారితే ఎలక్షను!

ఉదయం ఎనిమిది గంటలకు పోలింగు ప్రారంభమౌతుంది. ఈ రాత్రి ఎనిమిది గంటలకి అతని గుండెల్లో ఓటమి చీకటి గెడ్డకడుతోంది. అరుగుమీద తనముందు కూర్చున్న జనాన్ని ఒక్కసారి కలియచూశాడు.

"మీరంతా నా ముందెందుకు? వూరుమీదకి తగలబడి ఒక్కొక్కడు ఒక్కొక్క ఓటర్ని లోపుచేసుకోండి. ఒరేయ్ కిష్టిగా! సెట్టిబలిజి పేటలోకెళ్ళి ఎగస్పార్టీ మెంబరుతో మాటాడిరా, ఎటూ మొగ్గకుండా వుంటే అదు నెగ్గితే ఎంతైనా నేవాడ్ని కొంటానని సెప్పి యెళ్ళు...ఒరేయ్ నర్సిపులూ! నువ్వు నాతో లోనికి రారా" అంటూ ఒక్కొక్కళ్ళకే పనులు పురమాయించి, నర్సింహుల్ని తీసుకొని లోపలికి వెళ్ళిపోయాడు, తలుపుల్ని మూశాడు.

వీధంతా చీకటైపోయింది. లోపల వెలుగులో ఒంటరిగా ఆలోచిస్తున్నాడు నారాయణమూర్తి. ఆలోచన తెగక ఎఱ్ఱబడిన కళ్ళు జ్యోతుల్లా వెలుగుతున్నాయి.

చివరికి నర్సింహుల్ని దగ్గరకుపిలిచి చెవులు కొరికి, అలా సెయ్యి, వళ్ళు దగ్గరపెట్టుకో. పొరపాటు జరిగిందో నీ ప్రాణానికి ముప్పు. పని జరిగిందా నీ బతుకే యీడనుంచి బంగారం అంటూ తలుపుతీసి చీకట్లోకి సాగనంపాడు నర్సింహుల్ని.

తలుపులు దగ్గరకు లాగి అరుగుమీద చీకట్లో నిలబడ్డాడు. అంతా నిశ్శబ్దం, తన గుండెల అలికిడి వినబడుతోంది. పచారుచేస్తుంటే అడుగుల అలికిడి వినబడుతోంది. చెవులు రిక్కించి గాలి అలికిడిని వింటున్నాడు, క్షణం గడవడం కష్టంగా వుంది.

గాలి కల్లోలాన్ని మోసుకొచ్చింది, క్షణంలో చీకటిని ఎఱ్ఱని వెలుగు మింగేసింది. కేకలు, అరుపులు, కూతలు, భయం గాలిలో నిండిపోయింది.

అన్నిమూలల నుంచి ఒకే అరుపులు "మాలపల్లి అంటుకొంది" "మాలపల్లి అంటుకుంది" రెండంగల్లో అతను లోపలి కెళ్ళాడు. ఎఱ్ఱని కళ్ళు తెల్లబడ్డట్టు అద్దం చెప్పింది. చిందరవందరగా వున్న వూహల్ని అమర్చినట్టు రేగిన జుట్టును దువ్వుకొని, పైమీద కండువా వేసుకొని, నాయకుడు మంటలవేపు నడిచాడు.

అవే మంటలు –

సరిగ్గా అయిదేళ్ళక్రితం తనని కదల్చి బయటకి తెచ్చిన మంటలు తన భుజాన్ని కాల్చిన మంటలు, తనకి తెలియకుండా తనని నాయకుడ్ని చేసిన మంటలు, తన నాయకత్వం నిలబెట్టడానికి మళ్ళీ యిప్పుడు చెలరేగిన మంటలు. ఈసారి ఓ పద్ధతిలో బారులుతీరి కాల్తోంది మాలపల్లి. మంటలు ప్లానుప్రకారం వరసలో అగుపిస్తున్నాయి. జనం మంటలార్పడానికి ప్రయత్నం చేస్తున్నారు.

నారాయణమూర్తి జనంలో కలిసిపోయాడు.

ఈసారి పంచెగకట్టి మంటలో కెళ్ళలేదు.

కనుసన్నలతోటే ఓదార్చాడు.

తనచేతులతో వాళ్ళ వీపులు నిమిరాడు.

"నేనున్నాను, మీకేం భయం లేదు" అని హామీ యిచ్చాడు.

మామూలుగా నీళ్ళకారులొచ్చి చల్లారిన మంటల్ని చల్లార్చింది.

ఎర్రవెలుగు పోయి తెల్లవెలుగొచ్చింది.

ఈసారి చందాల కోసం గ్రామపెద్దల్ని పిలవలేదతను.

మాలపల్లిని తనవెంట నడిపించుకొని తన పెరట్లోకి చేర్చాడు. పెరటి తలుపులు మూయించాడు. తెరచివున్న వీధిగుమ్మాన మసలాల్సిన మనుషులు మసుల్తూనే వున్నారు.

రెండు మేకపోతుల్ని నరికించాడు. అగ్నిబాధితులకి విందుచేస్తున్నాడు, తను స్వయంగా వడ్డిస్తున్నాడు. తన బావమరిది వడ్డిస్తున్నాడు. నర్శింహులు వడ్డిస్తున్నాడు.

ఎముకలో మూలుగును పీలుస్తూ "సరిగ్గా ఎల్లక్షను రేపనగానే రాత్రిపూట మాలపల్లి ఎందుకంటుకుందంటావురా రాజిగా" అన్నాడు ఫౌజునించి తిరిగొచ్చిన కనకయ్య.

ఆ మాటలు నర్శింహులు చెవినిబడి వులిక్కిపడ్డాడు. నారాయణమూర్తి దగ్గరికి పరుగెత్తికెళ్ళి వూదాడు చెవిలో.

నారాయణమూర్తి, కనకయ్య దగ్గరకొచ్చి "ఒరేయ్ కనకయ్యా, నువ్వు బేగా లెగు. యీళ్ళకి గుడ్డలుకూడా లేవు పాపం. పట్నానికెళ్ళి పంచిలచాపులు, చీరలు పట్టుకొద్దువుగాని" అన్నాడు.

ఒక్కక్షణం అంతా నారాయణమూర్తిని మెరిసేకళ్ళతో చూశారు. దేవుడే దిగొచ్చాడనుకున్నారు.

"సరేనండి" అంటూ కనకయ్య లేచి పట్నానికెళ్ళాడు.

"మీరెవరూ యీ కన్నీళ్ళతో వెళ్ళి నాకు ఓటు చెయ్యక్కరలేదు. నాకు మీరు ముఖ్యంగాని ఈ పదవీ, డబ్బూ కాదు, మళ్ళీ కలెక్టరుతో మాట్లాడి డబ్బు శాంక్షన్ చేయించి మాలపల్లి కట్టిస్తాను, అందాకా, ఇక్కడే వుండండి" అని లోపలికి రాబోయాడు నారాయణమూర్తి.

"బాబూ! తవరు అలా సెలవివ్వకండి. మాకుర్ర సన్నాసులుకి తెలీక ఏదో ఏడిశారు. మీరు మాకెప్పుడూ దేవుడేబాబు, మీరే మా దేవుడు బాబు.

మీరొద్దన్నా మేఁవెళ్లి తవరికే ఓటేసొత్తాం. మాముందు నడండి బాబూ" అంటూ చుట్టూమూగారు మాలపెద్దలు ఆడా మగా.

"సరే అను బావా, అళ్ళంత పట్టుపడతావుంటే, అళ్ళకోసవేనా 'ఊఁ' అను బావా" అన్నాడు బావుమరిది.

ఊరేగింపుగా వెళ్ళి జనం ఓట్లు వేశారు.

నారాయణమూర్తి మళ్ళీ ప్రెసిడెంటుగా ఎన్నికయ్యాడు.

కాని కనకయ్య రాత్రికొస్తాడు. వాడాలోచించగలడు. వాడు నిజం కోసం తపనబడతాడు. నిజం ఓనాటికి కాకపోతే ఓనాటికి, వాళ్ళకి తెలుస్తుంది. అప్పుడు వాళ్ళగుండెల్లో మంటలు రేగుతాయి. అవి అరవు, నీళ్ళకారులు ఆ మంటల్ని ఆర్చలేవు. విందు భోజనాలు ఆ మంటల్ని ఆర్చలేవు... నిజం బయట పడిన్నాడు ఈ కథ కిది కాదు ముగింపు –

* * *